ప్రభుత్వ వైఫల్యంతో రాష్ట్రం ఐదేళ్లు వెనక్కి

- ఆదర్శ గ్రామాలు అస్తవ్యస్తంగా మారాయి
- అధికారులు బాధ్యతగా వ్యవహరించడం లేదు
- కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

మల్లాపూర్: కాంగ్రెస్ ప్రభుత్వ పాలన వైఫల్యంతో కేవలం పది నెలల్లోనే తెలంగాణ ఐదేండ్లు వెనక్కి వెళ్లిందని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం మల్లాపూర్ ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రజలు, రైతులు స్వర్ణయుగాన్ని చూశారన్నారు. మాజీ సీఎం కేసీఆర్ అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పరిపాలన అందించడంతో దేశంలోనే తెలంగాణ పల్లెలు ఆదర్శ గ్రామాలుగా నిలిచి అవార్డులు సొంతం చేసుకున్నాయని గుర్తుచేశారు. కాంగ్రెస్ మోసపూరిత హామీలు, వాగ్దానాలను ప్రజలు నమ్మి అధికారమిస్తే 10 నెలల్లోపే అన్నివర్గాల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందన్నారు. పంచాయతీలకు ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించకుండా జిల్లా, మండలస్థాయి అధికారులపై పనిభారం మోపడం దారుణమన్నారు. ప్రత్యేకాధికారులు గ్రామాలకు వెళ్లడం లేదని, దీంతో పంచాయతీ కార్యదర్శులు ప్రజా సమస్యలను గాలికొదిలేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆలయాల అభివృద్ధి పనులకు సంబంధించి తీర్మానాలను ఆపడంతో తహసీల్దార్ వీర్‌సింగ్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు ఒత్తిళ్లకు లొంగిపోయి తలవంచొద్దని, అధికారుల విషయంలో నా మంచితనాన్ని చేతకానితనంగా తీసుకోవద్దని హెచ్చరించారు. అభివృద్ధి పనుల్లో అందరూ కలిసికట్టుగా ఉండి గ్రామాభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో జగదీశ్, తహసీల్దార్ వీర్‌సింగ్, పీఆర్ డీఈ రమణరెడ్డి, ఇన్‌చార్జీ ఏడీఏ, ఏవో లావణ్య, డిప్యూటీ ఎఫ్ఆర్వో పద్మ, ప్యాక్స్ చైర్మన్ బద్దం అంజిరెడ్డి, పలుశాఖల ఏఈలు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

గురుకులాల్లో సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లండి

మెట్‌పల్లి: గురుకులాల్లో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకపోయి పరిష్కారానికి కృషి చేయాలని యూటీఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అద్దె భవనాల్లో సరైన వసతులు లేక ఉపాధ్యాయులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు వివరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు తిరుక్కోవెల శ్యాంసుందర్, చిన్న అంజయ్య, శ్రీనివాస్, రాజేశ్, సంతోష్, రవీందర్, లక్ష్మణ్ తదితరులున్నారు.

ఐలమ్మ స్ఫూర్తితో రాష్ట్రంలో ప్రజాపాలన

- జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



ఐలమ్మ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే

జగిత్యాలటౌన్: కోఠి మహిళా యూనివర్సిటీకి చాకలి ఐలమ్మ పేరు పెట్టడం అభినందనీయమని, చాకలి ఐలమ్మ స్ఫూర్తితో సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో ప్రజారంజక పాలన సాగిస్తున్నారని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ కొనియాడారు. కోఠి మహిళా యూనివర్సిటీకి చాకలి ఐలమ్మ పేరు ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం జిల్లా కేంద్రంలోని చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి, అనంతరం కాంగ్రెస్ నాయకులతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో బల్దియా చైర్‌పర్సన్ అడువాల జ్యోతి, వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, నాయకులు పంబాల రాంకుమార్, పద్మావతి, కప్పల శ్రీకాంత్, రజియొద్దీన్, కూతురు రాజేశ్, రజక సంఘం అధ్యక్షుడు దేవరాజ్, తదితరులు పాల్గొన్నారు.

మహిళా క్యాంటీన్‌ను సద్వినియోగం చేసుకోవాలి



క్యాంటీన్ ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఈవో

కోరుట్ల రూరల్: మహిళా క్యాంటీన్‌ను మహిళా మండలి సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా డిప్యూటీ సీఈవో,జిల్లా గ్రామీణాభివృద్ధి ప్రాజెక్టు సంచాలకులు రఘువరన్ అన్నారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ఐకేపీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన మహిళా క్యాంటీన్‌ను రఘువరన్ మంగళవారం ప్రారంభించారు. మహిళా క్యాంటీన్‌లో నాణ్యమైన సరుకులు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. క్యాంటీన్‌లో పిండి వంటలు, పచ్చళ్లు, మేలు రకం సన్న బియ్యం సభ్యులకు అందుబాటులో ఉంటాయని ఏపీఎం శంకర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి పీడీ చరణ్, తహసీల్దార్ వెంకట కిషన్, ఎంపీడీవో ఒడెల రామకృష్ణా, డీపీఎంలు,సీసీలు, వీవోఏలు, మహిళా సంఘాల లీడర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్‌తో సేవా భావం



శ్రమదానం చేస్తున్న పశువైద్య విద్యార్థులు

కోరుట్ల: ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమాలతో విద్యార్థుల్లో సేవా భావం పెంపొందుతుందని డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నడికట్ల సందీప్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఎన్‌ఎస్‌ఎస్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సాందీప్ మాట్లాడుతూ జాతీయ సేవా పథకం కార్యక్రమాలతో విద్యార్థి దశ నుంచే సేవా కార్యక్రమాలు అలవడుతాయన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రాజ్‌కుమార్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పశువైద్య కళాశాలలో..

కోరుట్ల రూరల్: పట్టణంలోని పీవీ నర్సింహారావు పశు వైద్య విశ్వ విద్యాలయంలో మంగళవారం జాతీయ సేవా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువైద్య విద్యార్థులు కళాశాల ఆవరణను శ్రమదానంతో శుభ్రం చేశారు.కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అసోసియేట్ డీన్ దాసరి శ్రీనివాస్, ఎస్‌ఎస్‌ఎస్ ప్రోగ్రా ఆఫీసర్లు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమాజ సేవలో విద్యార్థులు ముందుండాలి

జగిత్యాల: సమాజ సేవలో విద్యార్థులు ముందుండాలని జిల్లా ఎన్‌ఎస్‌ఎస్ నోడల్ అధికారి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు.కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అలియా మక్సూద్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి తిరుపతిరెడ్డి, రిజ్వానా, శిల్ప, సునీత పాల్గొన్నారు.

పంటలు రక్షించుకోవాలి



బీర్‌పూర్‌లో పంట పరిశీలిస్తున్న డీఏవో వాణి

జగిత్యాలఅగ్రికల్చర్: జగిత్యాల అర్బన్ మండలంలోని లింగంపేట శివారులో రైతులు సాగుచేసిన వరిపంటను మంగళవారం వ్యవసాయాధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా వరిలో మొగిపురుగు, అగ్గి తెగులు, బ్యాక్టీరియా ఎండుతెగులు లక్షణాలు ఉన్నట్లు, వెంటనే నివారణ చర్యలు తీసుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి వినీల, ఏఈవో నాగరాజు, రైతులు కిషన్, చిరంజీవి పాల్గొన్నారు.

సారంగాపూర్: పంటల్లో అధిక దిగుబడుల కోసం రైతులు అవసరమైన సస్యరక్షణ చర్యలతో పాటు యాజమాన్య పద్ధతులు పాటించాలని జిల్లా వ్యవసాయాధికారి బి.వాణి అన్నారు. మంగళవారం బీర్‌పూర్ మండల కేంద్రంలో వరి, పత్తి, కంది పంటలను రైతులతో కలిసి ఆమె పరిశీలించారు. వరికి ఆశించిన తెగుళ్ల నివారణకు రైతులకు సూచనలిచ్చారు. ఆమె వెంట మండల వ్యవసాయాధికారి తిరుపతినాయక్, ఏఈవోలు వినోద్, శిరీష, రైతులు ఉన్నారు.

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మండలంలో మండల వ్యవసాయ అధికారి రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో పసుపు, వరి పంటలను సందర్శించి మంగళవారం పరిశీలించారు.

మల్యాల: మండల కేంద్రంలోని వరి క్షేత్రాలను మండల వ్యవసాయాధికారి కె.చంద్రదీపక్ మంగళవారం సందర్శించారు.

పెగడపల్లి: మండలంలోని పలు గ్రామాల్లోని వరిపైరుతో పాటు కంది పంటలను వ్యవసాయశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో మంగళవారం పరిశీలించారు. ఏఈవోలు పవన్, నవీద్, మల్లేశం, సరోజన పంటలను పరిశీలించిన వారిలో ఉన్నారు.

రైతు నేస్తంతో విలువైన సమాచారం

సారంగాపూర్: రైతునేస్తంతో రైతులకు విలువైన సమాచారం అందుతుందని జిల్లా వ్యవసాయాధికారి వాణి అన్నారు. మంగళవారం సారంగాపూర్ రైతువేదికలో జరిగిన కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. పంటల్లో ఆధునిక పద్ధతుల్లో సాగు, మార్కెట్‌లో ధరలకు అనుగుణంగా డిమాండ్ ఉన్న పంటలను సాగుచేయడం , ఎరువుల వాడకం తదితర అంశాలపై శాస్త్రవేత్తలు, వ్యసాయాధికారులు, అభ్యుదయ రైతుల సూచనలు, సలహాలు అందుతాయని పేర్కొన్నారు. ఏవో తిరుపతినాయక్, ఏఈవో వెంకటేశ్, రైతులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి సహకరిస్తా



ప్రభుత్వ విప్‌ను కలిసిన విశ్వబ్రాహ్మణ నాయకులు

బుగ్గారం/ధర్మపురి: విశ్వబ్రాహ్మణుల సంఘం ఆధ్వర్యంలో బుగ్గారంలో ఇటీవల నిర్మించిన బ్రహ్మంగారి ఆలయ అభివృద్ధికి తనవంతుగా సహకారం అందిస్తానని ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ హామీ ఇచ్చారు. ఈ మేరకు మంగళవారం ఆయనను కలిసిన విశ్వబ్రాహ్మణుల సంఘం నాయకులు తమ సంఘం ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా అడ్లూరిని శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నగునూరి నర్సాగౌడ్, మండల నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడికి విప్ పరామర్శ

ధర్మపురి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు వేముల రాజేశ్‌ను మంగళవారం ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పరామార్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

ప్రభుత్వ విప్‌ను కలిసిన సిరికొండ గ్రామస్తులు

కథలాపూర్: మండలంలోని సిరికొండలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని కోరుతూ గ్రామస్తులు మంగళవారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు కలిశారు. సిరికొండ పరిధిలో వ్యవసాయ మోటార్లు అధికంగా ఉండటంతో ఓవర్‌లోడ్‌తో విద్యుత్ సమస్యలు వస్తున్నాయన్నారు. విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరు చేయాలని కోరగా.. స్థలం కేటాయిస్తే వీలైనంతా త్వరగా మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు.

ఎఫ్ఎల్ఎన్ పర్యవేక్షణ

రాయికల్: మండలంలోని వీరాపూర్ ధర్మాజీపేట గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలల్లో ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాన్ని జిల్లా సెక్టోరియల్ అధికారి కొక్కుల రాజేశ్ మంగళవారం పర్యవేక్షణ చేశారు. విద్యార్థుల కనీస అభ్యసన స్థాయిని తెలుసుకున్నారు. అనంతరం తాట్లవాయి ఉన్నత పాఠశాలలో న్యాస్ పరీక్షలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు ఆంజనేయులు, జనార్ధన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల పక్షపాతి

కోరుట్ల: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదల పక్షపాతి అని కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. మండలంలోని యూసుఫ్‌నగర్‌లో మహాలక్ష్మీ పథకంలో భాగంగా రూ.500 కే గ్యాస్ సిలిండర్ ప్రొసీడింగ్ పత్రాలను లబ్ధిదారులకు నర్సింగరావు అందజేశారు. ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పథకాలు అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో కోరుట్ల మార్కెట్ కమిటీ చైర్మన్ పన్నాల అంజిరెడ్డి, వైస్ చైర్మన్ వెంకటేష్ గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొంతం రాజం, గుగ్గిళ్ల ప్రియాంక, నాయకులు పాల్గొన్నారు.

ఈవో పర్యవేక్షణలో నిఘానేత్రాలు

కొండగట్టు: కొండగట్టు ఆలయంలో సుమారు 50 కి పైగానే నిఘానేత్రాలు ఉన్నాయి. అధికారుల నుంచి భక్తులకు అందుతున్న సౌకర్యాలు, ఆలయం వద్ద ఏమైనా అక్రమాలు చోటుచేసుకుంటే వాటి ద్వారా తెలుసుకోవచ్చని ఏర్పాటు చేశారు.తర్వాత వాటిని అధికారులు గాలికి వదిలేయగా, ఇటీవల వచ్చిన ఈవో రామకృష్ణరావు వాటి పని తీరును,ఆలయ వ్యవస్థను ఆయన మొబైల్‌లో చూసేలా ఏర్పాటు చేసుకున్నారు. ఈవో కార్యాలయంలో సైతం అన్ని కెమెరాలు కనిపించే విధంగా స్క్రీన్‌ను ఏర్పాటు చేసుకుని నిత్యం పర్యవేక్షిస్తున్నారు.

మంచినీటి సహాయకులకు శిక్షణ

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం, మెట్‌పల్లి మండలాల గ్రామీణ మంచి నీటి సహాయకులకు మంగళవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మొదటి రోజు బోరుబావులు, హ్యాండ్ పంపుల రిపేరింగ్‌పై శిక్షణను ఇచ్చారు. కార్యక్రమంలోఎంపీడీవోలు చంద్రశేఖర్, రామకృష్ణ, ఎంపీవో మహేశ్వర్‌రెడ్డి, మిషన్ భగీరథ డీఈలు ఆనంద్, ప్రేమ్, ఏఈలు, పాల్గొన్నారు.

క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల సందర్శన



పోలింగ్ బూత్ పరిశీలిస్తున్న డీపీవో

కోరుట్ల రూరల్: మండలంలోని మేజర్ గ్రామ పంచాయతీ అయిలాపూర్ గ్రామాన్ని జిల్లా డిప్యూటీ సీఈవో, డీపీవో రఘువరన్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యాలయంలో రికార్డులు తనిఖీ చేశారు. పారిశుధ్యంపై నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని అధికారులకు సూచించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామకృష్ణ, ఎంపీవో కృపాకర్, కార్యదర్శి నవీన్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు ఆహ్వానం



ఆహ్వాన పత్రిక ఇస్తున్న పద్మశాలీ నాయకులు

జగిత్యాలటౌన్: పద్మశాలీ సేవాసంఘం ఆధ్వర్యంలో జగిత్యాల పట్టణం అంగడిబజారులోని శ్రీ భక్తమార్కండేయ ఆలయంలో నిర్వహించే దుర్గామాత శరన్నవరాత్రి ఉత్సవాలకు హాజరుకావాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌లకు పద్మశాలీ సంఘం ప్రతినిధులు మంగళవారం ఆహ్వానపత్రికలు అందజేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు భోగ గంగాధర్, ప్రధాన కార్యదర్శి చెట్‌పల్లి సుధాకర్, పట్టణ కార్యదర్శి రాజేందర్, ప్రభాకర్, మంచాల శ్రీనివాస్ ఉన్నారు.

నాణ్యత పాటించకుంటే చర్యలు



నాణ్యత లేని పదార్థాలను పడేస్తున్న సిబ్బంది

జగిత్యాల: హోటళ్లలో తిను బండారాలను విక్రయించే వారు నాణ్యత లేకుండా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహేశ్వర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని పలు హోటళ్లు, బేకరీలను మంగళవారం తనిఖీ చేశారు. ఆహార పదార్థాలు నాణ్యతతో కూడినవి ఉండాలని, కాలం చెల్లినవి అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది మారుతి, రాము పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం



ఉచిత వైద్య శిబిరానికి తరలివచ్చిన రోగులు

మల్యాల: మండలంలోని అడ్డరోడ్డులోని కొత్త సురేశ్ పెట్రోల్ బంక్ ఆవరణలో మంగళవారం కొత్త సురేశ్, కోరుట్ల లయన్స్ క్లబ్ సంయుక్తంగా నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి స్పందన లభించింది. మండలంలోని వివిధ గ్రామాల నుంచి 300 మందికిపైగా ఉచిత నేత్ర శిబిరానికి తరలివచ్చారు. వారిని పరీక్షించి, 75 మందికి శస్త్రచికిత్స కోసం కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. కార్యక్రమంలో డీసీఎస్‌వో జితేందర్ రెడ్డి, హెచ్‌పీసీఎల్ సేల్స్ ఆఫీసర్ రాజేశ్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మహేందర్, కార్యదర్శి నరేందర్, కోశాధికారి జగపతి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



పార్టీ సభ్యత్వం అందిస్తున్న వికాశ్‌రావు

కథలాపూర్: కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి బీజేపీ నాయకులు తీసుకెళ్లాలని ఆ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చెన్నమనేని వికాశ్‌రావు కోరారు. మండలంలోని గంభీర్‌పూర్, తాండ్ర్యాల, పోతారం గ్రామాల్లో మంగళవారం బీజేపీ సభ్యత్వ నమోదు చేపట్టారు. మండలంలో 10 వేల మందితో పార్టీ సభ్యత్వం చేయించడమే లక్ష్యంగా నాయకులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపెల్లి గోపాల్‌రెడ్డి, బీజేపీ మండలాధ్యక్షుడు కంటె సత్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు.



సారంగాపూర్: బీర్‌పూర్ ఘాట్‌పై మూల మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. మిషన్‌భగీరథ ట్యాంకు సమీపంలో మూలమలుపు అత్యంత ప్రమాదకరంగా ఉంది. ఎదురెదురుగా వచ్చే వాహనాలు అస్సలు కనిపించవు. దీనికి తోడు వర్షాకాలం కావడంతో చెట్లు ఆకులతో దట్టంగా మారాయి. భవిష్యత్తులో బీర్‌పూర్ ఘాట్‌పై ప్రమాదకర మలుపులను తొలగించకపోతే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. మూలమలుపులు తగ్గించే విధంగా ఇంజనీరింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఈ సమస్యపై సంప్రదించాల్సిన అధికారి
ఆదిత్య, ఏఈ, ఆర్‌అండ్‌బీ, సారంగాపూర్, సెల్ నంబర్: 9440818883

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

సంక్షిప్త వార్తలు

ప్రతీ విద్యార్థి దేశం కోసం పోరాడాలి

జగిత్యాల: ప్రతీ విద్యార్థి తన కోసమే కాదు దేశం కోసం అనే భావన పెంపొందించుకోవాలని ఎస్‌కేఎన్ఆర్ ప్రిన్సిపాల్ అశోక్ అన్నారు. గాంధీజీ శత జయంతి ఉత్సవాల సందర్భంగా ఎన్‌ఎస్‌ఎస్ ఆవిర్భవించిందని, ఆయన అడుగుజాడల్లో యువత నడవాలన్నారు. ప్రతి విద్యార్థి సమగ్రమైన వ్యక్తిత్వం విలువలను పెంచుకోవాలన్నారు. అనంతరం కళాశాల విద్యార్థిని అనూష జాతీయస్థాయి ట్రెక్కింగ్ క్యాంపునకు ఎంపిక కాగా ఆమెను అభినందించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి రాజు, సాయి మధుకర్, గోవర్ధన్ పాల్గొన్నారు.

శ్మశానవాటిక రోడ్డు సమస్య పరిష్కరిస్తాం

మల్లాపూర్: శ్మశానవాటిక రోడ్డు సమస్యను పరిష్కరిస్తామని తహసీల్దార్ వీర్‌సింగ్ అన్నారు. మండలంలోని చిట్టాపూర్ గ్రామాన్ని మంగళవారం సందర్శించి గ్రామస్తులతో కలిసి శ్మశానవాటికను పరిశీలించి మాట్లాడారు. శ్మశానవాటికకు రోడ్డు లేక గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారని ఫిర్యాదు మేరకు రోడ్డు కోసం సర్వే చేయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ సురేశ్, కాంట్రాక్ట్ సర్వేయర్ రవి, వీడీసీ చైర్మన్ గంగం శేఖర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా నిరోధంపై అవగాహన

పెగడపల్లి: మానవ అక్రమ రవాణాను నిరోధించేందుకు యువత, విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. మండల కేంద్రంలోని ఆదర్శ మోడల్ స్కూల్లో మంగళవారం స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో పోలీసు కళాజాత బృందం సభ్యులచే పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎస్సై సత్తయ్య పీసీ సంపత్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పట్టణ పరిశుభ్రతలో పారిశుధ్య సిబ్బంది కీలకం

మెట్‌పల్లి: పట్టణ పరిశుభ్రతలో పారిశుధ్య సిబ్బంది కీలకమని కమిషనర్ మోహన్ పేర్కొన్నారు. స్వచ్ఛతా హీ సేవలో భాగంగా మంగళవారం పారిశుధ్య సిబ్బందికి మున్సిపల్ కార్యాలయ ఆవరణలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తడి, పొడి చెత్తను వేరు చేసి ఇచ్చేలా ప్రజలను ప్రోత్సహించాలన్నారు. అలాగే బహిరంగ ప్రదేశాల్లో చెత్తను వేయకుండా చూడాలన్నారు.

ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడాలి

కథలాపూర్: ప్రతీ ఒక్కరు సామాజిక బాధ్యతతో ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్(టీపీటీఎఫ్) రాష్ట్ర బాధ్యులు కొలుగూరి కిషన్‌రావు కోరారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో కథలాపూర్ ఉపాధ్యాయులను కలిసి టీపీటీఎఫ్ సభ్యత్వ నమోదు చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కొక్కుల రాంచందర్, కార్యదర్శి రాజయ్య, మండల ప్రతినిధులు పాల్గొన్నారు.

అల్లీపూర్‌లో కొనుగోలు కేంద్రం కేటాయించాలని వినతి

రాయికల్: మండలంలోని అల్లీపూర్ రైతుమిత్ర ఫార్మర్ ప్రోడ్యూసర్ కంపెనీ లిమిటెడ్‌కు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కేటాయించాలని కోరుతూ మంగళవారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిలకు వినతిపత్రం సమర్పించారు. నాబార్డ్ సహకారంతో రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్ స్థాపించబడిందని, ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కేటాయిస్తే బలోపేతమవుతుందని వారి దృష్టికి తీసుకెళ్లారు.

కార్యకర్తలే పార్టీకి అసలైన బలం

మేడిపల్లి: కార్యకర్తలే పార్టీకి బలం. బలగమని వేములవాడ నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు అన్నారు. ఉమ్మడి మేడిపల్లి మండలంలోని మన్నెగూడెంలో మంగళవారం వనభోజన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు.హామీలు విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వానికి రాబోయే రోజుల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు క్యాతం సత్తిరెడ్డి, ఉదిగిరి రమ్య, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

మేడిపల్లి: భీమారం హైస్కూల్‌కు చెందిన పలువులు విద్యార్థులు ఖోఖో, కబడ్డీ, అథ్లెటిక్స్ మరియు వివిధ విభాగాల్లో జిల్లా స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ పెసరి తిరుమలేశ్ తెలిపారు. బండపల్లి అభిషేక్, అంతడుపుల శ్రీహర్ష, భూమిని హర్షిత్, గుండెటి ప్రవీణ్, బత్తుల అనిల్, మందుల మనుశ్రీ, చిలువేరి రుచిత, పల్లికొండ కీర్తన, చుక్క హన్సిక, తాలుకా దీపిక, చెక్కపల్లి సుచిత్ర, ఆరె పావని, పుప్పాల రచన, ఆకునూరి శృతి, బైర మధుమిత, తాలుక అక్షయ జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం జవ్వాజి అశోక్ తెలిపారు. ఈ సందర్భంగా వారిని అభినందించారు.

వయోవృద్ధుల దినోత్సవ వారోత్సవాలు

జగిత్యాల: అక్టోబర్ 1న అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం పురస్కరించుకుని నేటి నుంచి వచ్చేనెల 1వ తేదీ వరకు వయోవృద్ధుల దినోత్సవ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా సంక్షేమాధికారి నరేశ్ తెలిపారు. ఈ వారోత్సవాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు, ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

గౌడ సంఘం నూతన కార్యవర్గ నియామకం

కోరుట్ల రూరల్: మండలంలోని సంగెంలో గౌడ సంఘం నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సుదవేణి భూమయ్య గౌడ్, ఉపాధ్యక్షుడిగా పల్లి ప్రకాష్ గౌడ్, కార్యవర్గ సభ్యులుగా శ్రీహరి గౌడ్, లింగం గౌడ్, జలేందర్ గౌడ్, పెద్ద లింగం గౌడ్, సత్యనారాయణ గౌడ్, కిషన్ గౌడ్, గణేష్ గౌడ్, రాములు గౌడ్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

బేడ బుడిగ జంగం కార్యవర్గం..

సారంగాపూర్: మండలంలోని పెంబట్లలో మంగళవారం బేడ బుడిగ జంగం కార్యవర్గాన్ని ఏర్పాటు చేసారు. సంఘ ప్రతినిధులుగా వివిధ హోదాల్లో పురాణం రాజేందర్, ^ంగరాజం, రేవెళ్లి గంగాధర్, తుర్పాటి శేఖర్, పత్రి దుర్గేశ్‌ను ఎన్నుకున్నారు.

హోటల్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

ధర్మపురి: పట్టణంలోని ఎస్ఆర్ఆర్ గార్డెన్‌లో మంగళవారం హోటల్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గంను ఏకగ్రీవంగా ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా స్తంభంకాడి మహేశ్, ఉపాధ్యక్షుడిగా మైదం తిరుపతి, అసం మణికంఠ, ట్రెజరరీగా అప్పం మల్లేశ్, సంయుక్త కార్యదర్శులుగా కుమార్, కైలాస్, సభ్యులు ఎన్నికయ్యారు.

ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షురాలిగా లావణ్య

జగిత్యాలరూరల్: ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షురాలిగా దువ్వ లావణ్యను నియమిస్తూ మంగళవారం ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు మైలారపు లింబాద్రి నియామక పత్రాన్ని అందించారు. ఆర్యవైశ్యుల మహిళల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తానని లావణ్య తెలిపారు. తన నియామకానికి కృషి చేసిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

దరఖాస్తులు ఆహ్వానం

జగిత్యాల: దీన్‌దయాళ్ వికలాంగ పునరావాస పథకం సమీకృత వృద్ధుల సంక్షేమ పథకం నుంచి ఎన్జీవోలకు సహాయం మంజూరు కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమాధికారి బోనగిరి నరేశ్ తెలిపారు. మాదక ద్రవ్యాల బారిన పడిన వారికి పునరావాసం కల్పించు కేంద్రాలను ప్రభుత్వేతర సంస్థలు, వృద్ధాశ్రమాలు నిర్వహించే సంస్థలు, మరింత మెరుగైన సేవలందించేందుకు నిధులు కావాలనుకునే వారు సంబంధిత ఆధార పత్రాలతో జిల్లా వయోవృద్ధుల కేంద్రంలో ఈనెల 30లోపు అందజేయాలని పేర్కొన్నారు.